# పాత బంగారులోకం

వాల్డన్ ముందున్న బస్టాప్.

చైతన్య. ఏడేళ్ళ బాబు. ఐదేళ్ళ పాప. రద్దీగా వున్న బస్టాప్. రాని బస్సులు. ఆగని బస్సులు. బస్టాప్‌కి దూరంగా ఆగే బస్సులు.

"ఆటోలో పోదాం" పాప గొడవ.

"ఆటో ఏది" బాబు ప్రశ్న.

ట్రాఫిక్ సిగ్నల్ క్లియర్ అయినట్టుంది. పంజాగుట్ట నుంచి గ్రీన్‌లాండ్స్ వైపు దూసుకుపోతోన్న మోటార్ వాహనాలు.

మెట్రోలైనర్ ఆగింది.

తోసుకుంటు తోసుకుంటు పిల్లలతో బస్సు ఎక్కింది. గ్రాండ్ కాకతీయ దగ్గరకొచ్చేసరికి గ్రీన్‌లాండ్స్ చౌరస్తా ట్రాఫిక్ సిగ్నల్ పడింది. వాహనాలన్నీ ఆగిపోయాయి. హారన్ రొద. మ్యూజిక్ రొద. ఆ పక్క రోడ్డు నుంచి జుమ్మంటూ వాహనాల రొద. పొగ. నల్లని పొగ. తెల్లని పొగ. ముక్కులోంచి వూపిరితిత్తుల్లోకి పాయిజన్. స్లో పాయిజన్. చెమటపట్టిన

శరీరంపై అతుక్కుపోతోన్న పొగ. ధూళి. దురద. మంట. బొబ్బలు. స్కిన్ అలర్జీ. అలోపతి-నో-ఆయుర్వేదం - నోనో-హోమియోపతి - కుదర్దు. తగ్గదు. మరెలా? స్కిన్ కేన్సర్ - ఎండ్ పాయింట్.

"ఆటోలో పోదాం" పాప సన్నని ఏడుపు.

జనంలో నలిగిపోతోన్న పిల్లలు.

మెట్రోలైనర్‌లో టికెట్ ఛార్జి బోలెడు. కూర్చోడానికి తప్పకుండా సీట్ దొరుకుతుందన్న ప్రామిస్‌తో. కానీ నిలబడటానికి కూడా చోటులేదు. వూపిరాడటం లేదు. ఉక్కిరిబిక్కిరవుతోన్న పిల్లలు.

తోసుకుంటూ రాసుకుంటూ చైతన్య బస్సు దిగిపోయింది ఇద్దరు పిల్లలతో. దిగ్గానే సిగ్నల్ క్లియర్ అయింది. నిలబడిన చోటే ముగ్గురూ నిలబడిపోయారు. కదిలితే ఏ యింజన్ కింద ముద్దవుతామో! సిగ్నల్ పడింది. ముందుకు కదిలారు.

రోడ్డు పక్కగా నిలబడి ఖాళీ ఆటోకోసం చూస్తున్నారు.

రోడ్డు నిండా మెట్రోలైనర్లు. సిటీ బస్సులు. మారుతి. మారుతి 1000 సి.సి. జెన్. సీలో జిప్సీ. మెటాడోర్. అంబాసిడర్. ఫోర్డ్. సన్ని. కైనెటిక్. చేతక్. హమారా బజాజ్. జీపులు. ఆటోలు - ఎటు చూసినా వాహనకెరటాలే. ఇంతకు ముందు యిన్ని రకాల కార్లు వేన్లు రోడ్డు మీద చూశామా! రెండుమూడు కంపెనీలవి వుండేవి. ఇప్పుడో దేశవిదేశాలవి రోడ్లనిండుగా.

"కారు వెంట కారు లైన్‌గా వెళ్ళవెందుకమ్మా? స్టార్‌ప్లస్‌లో చూపించినట్టు" పాప అడిగింది.

"అది అమెరికా" అంది చైతన్య.

"మరి ఇక్కడా అన్నేసి కార్లున్నాయి కదమ్మా" అన్నాడు బాబు.

"రోడ్లు లేవుగా" అంది పాప.

ఇరుకు. ఊపిరి సలపడం లేదు. రోడ్లు ఇంకా ఇంకా ఇరుకైపోయి మనుషుల్ని నెట్టేస్తున్నాయి. కొన్నాళ్ళకి అడుగుతీసి అడుగెయ్యటానికి కూడా తోవ మిగలదేమో!!

ఇల్లు చేరుకున్నారు. పిల్లల అల్లరి. టీవిలో రంగులు మారుతున్న లోకాలు.

"క్యాడ్ బెరి....డైరీ మిల్క్.....పెర్క్"....గొడవ చేస్తున్నారిద్దరు.

"ఉదయమే తిన్నారుకదమ్మా. మళ్ళీనా? నో" అంది చైతన్య.

"ఇస్తేనే రేపు స్కూల్‌కి వెళతాం"

"మానెయ్యండి" చైతన్య కోపంగా అంది.

"టీ.వి. యింటికి పోదామురా అన్న"

"ఎందుకు"

"అక్కడ బోల్డన్ని చాక్‌లెట్స్"

"ఎలా వెళ్ళాలి"

"టీ.వి.లో ఎడ్రస్ చదువుతారుగా"

"పోదాం"

"ఎలా వెళతారు" అడిగింది చైతన్య.

చిన్నపిల్లలు, టీ.వీలో చూపించేవన్నీ సొంతం చేసుకోవాలనే తాపత్రయం. కళ్ళ ముందున్న శిఖరాల్ని నిచ్చెనలు లేకుండానే ఎక్కాలని ఆరాటం. కనిపించేదంతా వట్టి మోసమని, అదంతా ఇరుకేనని తన పిల్లలకి చెప్పుకోలేక సతమతమవుతూ చైతన్య.

◆◆◆

"గత ఆరు నెలలుగా మీరు పంపించిన డబ్బులు. అయిన ఖర్చులు" పుస్తకం అందించింది.

"బియ్యం, పప్పులు, నూనె, పంచదార, ఇంటిఅద్దె, పాలు, పేపర్, చాక్‌లెట్స్"- పద్దు చూస్తున్న అతను ఆగి తలెత్తి "పిల్లల చాక్‌లెట్స్ ఖర్చులోనే రాయాలా? అదో బడ్జెట్టా" అని అడిగాడు.

"పిల్లల చాక్‌లెట్స్ అంటే ఎంత అవుతుందనుకుంటున్నారు" అడిగింది.

"ఎంతవుతుందీ మహా అయితే ........." అని ఆగిపోయాడు.

"వూఁ మహా అయితే" చైతన్య రెట్టించింది.

అతను మాట్లాడలేదు.

"రోజుకి ఇరవై రూపాయిలు, నెలకి ఆరొందలు. అదీ రోజుకి వొక్కటైతేనే" చెప్పిందామె.

"వాళ్ళకి ఎవరు అలవాటు చేయమన్నారూ?"

"టీ.వి."

"టీ.వి.? టీ.వీ. ఎందుకు అలవాటు చేసావ్" అడిగాడు.

"వద్దంటే వింటారా? టీ.వి.లో కనిపించే యాడ్స్- ఆ బొమ్మలు, ఆటలు, బట్టలు, కూల్‌డ్రింక్స్, చాక్‌లెట్స్ అన్నీ రుచి చూస్తామంటారు. పిల్లలు కదా. వోసారి కొనిస్తే పోలా అనుకుంటాం. వాళ్ళకి రుచి నచ్చింది. రోజూ కావాలని గొడవ. పళ్లు పాడైపోతాయంటే పెప్సొడెంటో, క్లోజప్పో వుందంటారు. అదీ కాకుండా క్లాసుకి చాక్‌లెట్స్ చాలమంది పిల్లలు తెచ్చుకుంటారు. పిల్లల్లో యిన్‌ఫీరియారిటి కాంప్లెక్స్ పెంచి పోషించ కూడదని అధునిక ఆరోగ్యశాస్త్రం చెపుతోంది కదా" అందామె.

"డబ్బులు లేవని చెప్పొచ్చుగా"

"వీసాకార్డో, మాస్టర్‌కార్డో యిద్దాం - అంటున్నారు"

"వాళ్ళనని లాభంలేదు. నిన్ను అనాలి. బఠాణీలు, మరమరాలు అలవాటు చేయవచ్చుగా" విసుగ్గా సలహా ఇచ్చాడు.

"వాటికి యాడ్ లేదుకదా. యాడ్ వుంటే అవే అలవాటైపోతాయ్. నేనేం చెయ్యక్కర్లేదు"

"వూఁ సరే ఈ ప్రైమ్‌స్పోర్ట్స్ గొడవేంటి" అడిగాడు.

"మీ ముంగిట్లో డిస్నీలాండ్" అందామె.

"సరిగ్గా చెప్పు"

"ఆటలు. పిల్లలకి ఆటవిడుపు. కంప్యూటర్ గేమ్స్. నాలుగు రూపాయిలిచ్చి నిమిషం సేపు బాల్ ఆడతారు. ఎనిమిది రూపాయిలిచ్చి కారు నడుపుతారు. దట్సాల్"

"డబ్బులిచ్చి ఆటలేంటి? స్కూల్లో ఆడేఆటలు సరిపోవటం లేదా"

"స్కూల్లో ఆటలా? పూర్వం పాఠశాలల్లో ఆటస్థలం వుండేది. పిల్లలు మానసికోల్లాసం కోసం ఆటలు ఆడేవారు. అదంతా చరిత్ర. నో ప్లేగ్రౌండ్స్. ఇళ్ళ దగ్గర పార్కింగ్‌ప్లేస్ కోసమే రోజూ గొడవలు. సో ఈ ప్రైమ్‌స్పోర్ట్స్, జాలీరైడ్సే శరణ్యం" అందామె.

"ఇంత ఖర్చా"

"అక్కడేం వుండవా యిలాంటివి"

"ఉంటాయి. బట్ ఇట్స్ నాట్ ఎ బర్డన్"

"అయిందా మీ జమాఖర్చుల తనిఖీ. పడుకుందాం. రేపు వుదయం క్యాంప్‌కి వెళ్ళాలి" అలసటగా పక్కపై వాలిపోతు అందామె.

"రేపా? నేనుండేది వారమే"

"తప్పదు. మా డైరెక్టర్ వొప్పుకోడు. మా ఆయన పదిరోజులు శెలవుపై వచ్చాడు. వారం లీవ్ యివ్వమన్నా, నోక్యాంప్స్ అన్నా మా డైరెక్టర్ 'స్త్రీలు-వుద్యోగం' అంటూ ప్రజలని ఉద్దేశించి ప్రసంగించేస్తాడు. పిల్లలకి బాగులేదు. మొగుడొచ్చాడు. యస్ ఈ ఆడవాళ్ళంతా యింతే. అన్‌ఫిట్ ఫర్ వర్క్ అనేస్తాడు. తప్పదు. మేం అన్ని పనులకి ఫిట్ అని ప్రతిక్షణం ప్రూవ్ చేసుకుంటుండాలి. ఇంటా, బయటా, రాత్రి, పగలు" అతని కౌగిలికి రెస్పాండ్ అవుతూ అందామె.

ఉద్యోగాలలో వూపిరాడదు. జమాఖర్చులు తేలందే పడకమీద శాంతిగా నడుంవాల్చలేం. పిల్లల ఆటస్థలాలు కూడా కుదించుకుపోయాయి. ఆటల్ని కొనుక్కోవాలి. ఇరుకు ఇరుకు ఇరుకు.

◆◆◆

"ఇది అన్యాయం. అక్రమం" వుపన్యాసం సాగుతోంది.

స్టేజ్ నిండుగా మగవాళ్ళు.

"మీరు మాట్లాడతారా" సెక్రటరీ అడుగుతున్నాడు.

"నేనా? ఎందుకు" అడిగింది చైతన్య.

"అంతా మగవాళ్ళే అయిపోయారు"

"అందుకనే అయితే మాట్లాడను"

“చూడు. అంతావాళ్ళే. ఆడవాళ్ళు లేరు” చిన్నగా అంటుందో స్త్రీ.

“ప్చ్. వూరేగింపు మజా అంతా ఎగరకొడుతున్నాడుగా దంపుడు వుపన్యాసంతో” చికాకుపడుతోందో యువతి.

“ఇక్కడ్నుంచి యింటికేనా” ఆ యువతిని అడుగుతున్నాడో యువకుడు.

“ఆఁ”

“నేను రానా? చాలా రోజులయింది. నీతో మాట్లాడి” అని అన్నాడా యువకుడు.

“ఏం మాట్లాడాలి” అని అడిగిందా యువతి.

“ఏకాంతంగా మాట్లాడాలి”

“ఏం శరీరం అడుగుతోందా”

“అదొక్కటే కాదుగా” నసిగాడా యువకుడు.

“చెప్పొచ్చుగా డైరెక్ట్‌గా. ఎందుకా ఏకాంతము, సాయంత్రమూ” అల్లరిగా నవ్వుతుందా యువతి.

యువకుడు దిక్కులు చూస్తున్నాడు.

“ఐ యామ్ ఫెమినిస్ట్.....మొన్న నే రాసిన కవిత చూసారా” అడుగుతున్నాడో కవి.

“అయ్యా ఘనతవహించిన కవిగారూ! ఫెమినిస్ట్ అంటే ఏంటండీ” అడిగిందా రచయిత.

“మీరు”

“నేనా”

“కాదా”

“ఏమో....భలే వుందే. నాకే తెలియదు. మీకెలా తెలిసిందో” ఆశ్చర్యంగా అందామె.

“భలేవారే. మీరు పోస్ట్‌మాడ్రన్ ఫెమినిస్ట్. నాకు తెలుసు” స్పష్టంగా చెప్పాడతను.

"ఆఁ ఆఁ తెలిసివుండొచ్చులే. శరీర నిర్మాణం తెలియదు. రససిద్ధి మీద కవిత్వం రాస్తారుగా. అలానే ఇదీ తెలిసుండొచ్చు" అందా రచయిత.

మగవాళ్ళ వుపన్యాసాల పరంపర కొనసాగుతోంది. కబుర్లు. సోడాలు తాగటం. వెలుగుతోన్న సిగరెట్లు.

"మీరు మాట్లాడతారా" రచయితని అడుగుతున్నాడు సెక్రటరీ.

"మీ మాటలా" అని అడిగింది.

"మీరు" యువతి వేపు తిరిగి అడిగాడు మళ్ళీ.

"మాటలా అరుపులా"

ఎవ్వరూ మాట్లాడమంటున్నారు. సెక్రటరీ గుండెలు లబలబలాడుతున్నాయ్ - స్టేజి అంతా మగవాళ్ళే ఆక్రమించేసారనే అప్రతిష్ఠని మొయ్యాలని. "స్త్రీలని ఈక్వల్‌గా చూడడు" అంటే పరువు పోదూ!

"మాట్లాడమంటే ఎవ్వరూ మాట్లాడమంటున్నారు" సెక్రటరీ బిక్కముఖం వేశాడు.

"ఎందుకట? వీళ్ళంతా యింతేనయ్యా. మీరు వినిపించుకోరు. చాదస్తం కాకపోతే మాట్లాడాలి అనుకోవటం ఏమిటి? ఎంత ఎంకరేజ్ చేసినా వాళ్ళింతేనయ్యా. అన్నిటికి వాళ్ళని పిలవటం దండగ. ఆ రోజంటూ వస్తే అందరి విముక్తి జరుగుతుంది"

పాత మాటలు. పాత గొంతుకలు. పాత చికాకులు. పాత కోపాలు. పాత కక్షలు. పాత స్నేహాలు. పాత ఆవేశం. పాత అలింగనం - ఇరుకు.